

# నేనే నా ఆయుధం

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్ధ గాధ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు...
కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో
చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు...
విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...
ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..!
పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన
ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!
ప్రతీ నిరుద్యోగీ, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న
ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్
**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

## (క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

## 8

మా పొలాన్ని రామచంద్రరావు అనే ఆయన చూస్తూ ఉండేవాడు. ఒక రకంగా చెప్పాలంటే కౌలుకి అన్నమాట. అయితే 'ఇంత' అని లేదు. వచ్చిన దాన్లో కాస్త కాస్త తీసుకోవటం.

రాబడి తక్కువ. పని ఎక్కువ.

నా మీద మా పెద్ద బావ ప్రభావం ఎంత ఉందో రామచంద్రరావు ప్రభావం కూడా అంతే ఉంది. ఆయన పొద్దున్నే లేచి, గాఢ నిద్రలో ఉన్న నన్ను బలవంతంగా లేపి, ఎడ్ల బండి కట్టుకుని పొలానికి నాలుగింటికి తీసుకెళ్ళేవాడు.

మా పొలంలోనే నేను కూలీలా పని చేసేవాడిని.

చెరువు మట్టి బండిలో తీసుకువచ్చి పొలంలో వేయటం, నాట్లు నాటటం, పొలం దున్నటం మొదలైనవన్నీ ఆయన నాతో చేయించేవాడు.

నాకు పూరీ అంటే చాలా ఇష్టం. ఇలా పని చేసినందుకు నాకు హొటల్లో పూరీ పెట్టించేవాడు. బాండెడ్ లేబర్ లాంటి పెద్ద పెద్ద పదాలు వాడను కానీ, ఆయన ఎంతో పని చేయించుకొని కేవలం ఒక పూరితోనే కూలి సరి పెట్టేవాడు.

ఏమైతేనేం మొత్తం మీద ఆ రకంగా నేను నాట్లు వేయటం, పొలం దున్నటం, గుంద్రుక కొట్టటం (భూమిని చదును చేయటం) మొదలైనవన్నీ అప్పుడే నేర్చుకున్నాను.

కాలం గడిచే కొద్దీ ఇటువంటి గానుగెద్దు జీవనవిధానం పట్ల ఒక రకమైన నిరాసక్తత ఏర్పడి విరక్తి కలగసాగింది. తెల్లవారుజామునే వెళ్ళి నడుము విరిగేలా పనులు చేయటం, పొలం పనుల అలసట, రాత్రి ఇంటికి వచ్చి శవంలా పడుకోవటం... అంతంత మాత్రం రాబడి..!

చదువుకుంటే తప్ప ఇలాంటి లేబర్ పనుల నుండి బయటపడలేను అనే అభిప్రాయం బలపడసాగింది.

సరిగ్గా ఆ సమయంలోనే నన్ను కొద్ది కొద్దిగా మార్చి, ప్రభావితం చేసిన సంఘటనలు రెండు మూడు జరిగాయి.

అందులో మొట్ట మొదటిది నా పద్నాలుగేళ్ళ వయసులో జరిగింది.

నాకు గుర్తున్నంతలో అప్పుడు నేను తొమ్మిదో క్లాసు చదువుతున్నాను.

మా పొలాన్ని కౌలు చేసే రామచంద్ర రావు భోజనానికి వెళ్ళినప్పుడు, రాత్రి కాపలాకి రెండు మూడు గంటల పాటూ అమ్మ పొలం దగ్గిరే ఉండాల్సి వచ్చేది. అమ్మకి తోడుగా నేను కూడా వెళ్ళేవాడ్ని.

ఒక రోజు రాత్రి పదింటికి నాకు తేలు కుట్టింది. చాలా పెద్ద తేలు.

రెండు నిముషాల పాటు ఏమీ అనిపించలేదు.

తరువాత ఒక్కసారిగా ప్రాణం పిండేస్తున్నంత బాధ కలిగింది.

గట్టిగా ఏడవసాగాను.

ఆ చీకట్లో అమ్మా, నేనూ ఇద్దరమే ఉన్నాం. చుట్టూ అన్నీ పొలాలే.

ఆ రోజుల్లో తేలు కాటుకి మందుల్లేవు. మంత్రమే శరణ్యం.

మంత్రం వేసే వ్యక్తి పక్క ఊళ్ళో ఉంటాడు. అమ్మా నేనూ ఆ ఊరివైపు నడవసాగాం. అయిదు నిముషాల తర్వాత బాధ ఎక్కువై నేను పడిపోయాను.

అప్పుడు అమ్మ నన్ను ఎత్తుకొని ఒక కిలోమీటరు నడిచింది. అలసి కొంచెం సేపు ఆగి, మళ్ళీ ఎత్తుకొంది. నాకు బాగా జ్ఞాపకం. కాళ్ళు కొట్టుకుంటున్నాను.

అలా రెండు గంటలు ప్రయాణం చేసి ఆ ఊరు తీసుకెళ్ళింది.

పద్నాలుగేళ్ళ కొడుకుని ఎత్తుకుని, నాలుగు కిలోమీటర్లు నడవటమంటే మాటలు కాదు.

ఆ సంఘటన తలుచుకుంటే ఇప్పటికీ నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి.

ఇది జరిగిన రెండు రోజులకి మళ్ళీ అన్నయ్య గుర్తొచ్చి అమ్మ నిద్రలో లేచి ఏడవసాగింది. నేనూ లేచి కూర్చున్నాను. ఈ సారి ఏడవలేదు. ఆమెనే చూస్తూ కూర్చున్నాను. ఒక వైపు అన్నయ్య వెళ్ళిపోయాడు. ఇంకో వైపు నేను ఇలా తయారవుతున్నాను. ఇలా ఎంతకాలం?

అమ్మని ఏ విధంగానైనా సుఖపెట్టాలన్న కోరికకి బహుశ అప్పుడే నాలో అంకురార్పణ జరిగి ఉంటుంది.

**9**

ప్రతీ మనిషికీ గమ్యం, కోరికా అని రెండు ఉంటాయి. మీరు ఏ విద్యార్థినైనా "నీ గమ్యం ఏమిటి?" అని అడగండి. డాక్టరో, ఇంజినీరో, కలక్టరో అంటాడు.

మరి అందరూ ఎందుకలా అవలేరు?

ఎందుకంటే కోరిక ఒకలా ఉంటుంది. గమ్యం వేరేగా ఉంటుంది.

కోరిక సినిమాలూ, టీవీలూ, చాటింగ్‌లూ అయినప్పుడు, గమ్యం చేరుకోవటం కష్టం.

ఇప్పుడు నా పరిస్థితి తీసుకుందాం. నా కోరిక ఈ పొలం పనుల నుంచీ, అలసట నుంచీ నిరాసక్తత నుంచీ బయట పడటం. మరి గమ్యం?

నిజం చెప్పాలంటే నాకు గమ్యం ఏమీ లేదు. నిజానికి, గమ్యం అంటే ఏమిటో కూడా ఆ రోజుల్లో తెలీదు. ఆ విధంగా ఆలోచిస్తే నా గమ్యమూ కోరికా ఒకటే.

ఈ కష్టంలోంచి బయట పడటం.

అసంతృప్తి మనిషిని నిరాసక్తుడిని చేస్తుంది. కోరిక మనిషిని దార్లు వెతికేలా చేస్తుంది.

ఏ దార్లో వెళ్ళాలా అని ఆలోచించాను.

వర్తమానంలో పొలం పనులు తప్పించుకోవాలన్నా, భవిష్యత్తులో అమ్మని ఈ పనుల నుంచి తప్పించాలన్నా ఒకటే మార్గం. కాలేజీకి వెళ్ళటం..!

దాంతో కష్టపడి సప్లిమెంటరీలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ పాసయ్యాను. అది ఎంత సంతోషమంటే, ఊళ్ళో ఇంటింటికీ తిరిగి అందరికీ స్వీట్లు పంచాను.

ఇహ కాలేజీకి వెళ్ళాలి.

వరంగల్‌లో చందా కాంతయ్య మెమోరియల్ (సి.కె.ఎం) కాలేజి అని చాలా ప్రసిద్ధి. వరవరరావు, కోదండరామ్ పని చేసిన కాలేజీ అది. పౌరహక్కుల సంఘ నేతలందరూ అక్కడ చదువుకున్నారని ప్రతీతి. గద్దర్ పిల్లలు కూడా అక్కడ చదివారు.

అక్కడ అప్లికేషన్ తీసుకున్నాను. నాకు గైడ్ గానీ సలహాదారు గానీ ఎవరూ లేరు. ఎంత అమాయకంగా ఉండే వాడిని అంటే, కాలేజి క్యూలో నిలబడి అప్లికేషన్ పూర్తి చేస్తున్నప్పుడు హెచ్.ఇ.సి., సి.ఇ.సి. గ్రూపుల్లో దేనికి టిక్కు పెట్టాలో తెలియనంత..! దీన్ని అమాయకత్వం అంటారా? అజ్ఞానం అంటారా?

నా వెనుక ఉన్నవ్యక్తిని “ఏది టిక్కు పెట్టాలి?” అని అడిగాను.

నాకన్నా అజ్ఞానో, జీవితంలో పండిపోయిన వేదాంతో అయి ఉండాలి. “ఏది పెట్టినా పర్లేదు” అన్నాడు.

చివరికి హెచ్.ఇ.సి. టిక్కు పెట్టాను. అంటే చరిత్ర,, ఆర్థిక శాస్త్రం, పౌర శాస్త్రం.

సి.కె.ఎం. కాలేజీలో సీటు రావటం దాదాపు అసాధ్యం. సిమెంటు బస్తా డొనేషన్ ఇస్తే సీటు ఇచ్చే కాలేజి కాదు. మరేం చెయ్యాలి?

నా దూరపు బాబాయి వరుస బంధువొకాయన అక్కడ గుమస్తాగా పని చేసేవాడు. ఆయన దగ్గరకు వెళ్ళి సాయం చెయ్యమని అడిగాను. అంత తొందరగా పని అవలేదు. చాలా సార్లు వెళ్ళవలసి వచ్చింది.

వెళ్ళిన ప్రతీసారీ మా పొలంలో పండిన వేరు శనగకాయలూ, మొక్కజొన్న కంకులూ తీసుకెళుతుండే వాడిని. ఆయన కన్నా పిన్ని నన్ను బాగా ఇష్టపడేది.

పల్లెటూర్నుంచి వచ్చి చదువుకోవాలనే తపనతో నేను చేస్తున్న ప్రయత్నాల్ని మనస్ఫూర్తిగా మెచ్చుకునేది. ఆవిడ ఏం చెప్పిందో తెలీదు కానీ, ఆయన నా కేసు రికమెండ్ చేశాడు. దాంతో నాకు సీటు దొరికింది.

మంచి కాలేజిలో ఇంటర్మీడియెట్ సీటు సంపాదించిన తర్వాత, మా ఊరు నుంచి 'కాలేజికి ఎలా వెళ్ళాలి?' అనేది సమస్య. ఏదో ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకొని వరంగల్‌లో పార్ట్ టైం చేస్తూ అక్కడే ఉండి చదువుకోవచ్చు. కానీ అమ్మ ఒంటరిదై పోతుంది. కాబట్టి తప్పనిసరిగా నేను ఇంట్లోనే ఉండాలి.

మా ఊర్నుంచి వరంగల్‌కి బస్ చార్జీలు ఇరవై రూపాయలు. ఆ రోజుల్లో మాకు అది పెద్ద భారం. ఆ సమస్యకి పరిష్కారం నాకు నా రఘువరన్ సైకిల్ చెప్పింది.

వెంకటాపురం నుంచి వరంగల్ ఇరవై ఏడు కిలోమీటర్లు. పొద్దున్నే అయిదింటికి లేచి సైకిల్ మీద బయలుదేరేవాడిని.

ఇలా నెలరోజులు గడిచాయి.

తిరిగే కాలూ... తిట్టే నోరూ ఊరుకోవు అంటారు. ఆలోచించే మనసు కూడా ఊరుకోదు. అది పాజిటివా? నెగెటివా? అనేది, మనం దానికిచ్చే తర్ఫీదు బట్టి ఉంటుంది.

---

ఒక రోజు మధ్యాహ్నం క్లాసుల్లేక మా స్నేహితుడింటికి వెళ్ళినప్పుడు వాళ్ళమ్మ మాటల సందర్భంలో 'పట్నంలో మండిపోతున్న కూరగాయల ధరల...' గురించి చెప్పింది.

అప్పుడు నాకో ఆలోచన వచ్చింది.

నేను వరంగల్ వెళ్ళేసరికి, కాలేజీకి ఇంకో అరగంట టైముండేది. ఒక గంట ముందు బయల్దేరితే గంటన్నర టైముంటుంది.

మా పొలంలో కాకరకాయలు విపరీతంగా పండేవి. పొద్దున్న నాలుగింటికి లేచి సైకిల్ మీద కాకరకాయల గంప కట్టుకొని కాజీపేట వెళ్ళేవాణ్ణి.

ఆరింటి నుంచీ ఎనిమిదింటివరకూ వీధిలో తిరుగుతూ  కాకరకాయలు అమ్మేవాణ్ణి.

మా కాలేజీ పక్కన ఒక కాఫీ, భోజన హోటలుండేది. అన్నీ అమ్మగా చివరలో పుచ్చువీ, పండినవీ మిగిలిపోయేవి. అలా మిగిలిపోయినవన్నీ తీసుకెళ్ళి హోటల్ ముందు ఉన్న డబ్బాలో పోయాలి. పండిపోయిన కాకరకాయల్ని అతనేం చేస్తాడో అప్పుడర్థమయ్యేది కాదు. ఇప్పుడర్థం అవుతోంది.

అలా ఇచ్చినందుకు ఆ హోటలు యజమాని కడుపు నిండా ఉచితంగా బ్రేక్‌ఫాస్ట్ పెట్టేవాడు.

కూరగాయలు కొన్నవాళ్ళెవరూ "పొద్దున్నే" డబ్బులు ఇచ్చేవారు కాదు. అది వారి సెంటిమెంట్.

అందువల్ల సాయంత్రం కాలేజీ అయిపోయిన తర్వాత అందరి ఇళ్ళకూ వెళ్ళి  వసూలు చేసుకోవాల్సి వచ్చేది. చివర్లో మళ్ళీ హోటల్‌కి వచ్చేవాడ్ని. నాకు టిఫిన్ పెట్టేవాడు. ఇక మధ్యాహ్నం లంచ్ అవసరం పడేది కాదు. ఆవిధంగా నా ఆహార సమస్య తీరింది.

నా తరువాతి సమస్య బట్టలు. మొదటి రోజు నిక్కరు వేసుకుని వెళ్ళాను. జూ లోకి కొత్త జంతువు వచ్చినట్టూ చిత్రంగా చూశారు. కాలేజికి వెళ్ళాలంటే ఫ్యాంట్లు వేసుకోవాలని తెలిసింది.

అంత డబ్బు లేదు. అప్పుడు మా బావ తన బెల్‌బాటమ్ ఫ్యాంట్లు రెండు ఇచ్చాడు. అప్పుడే అవి కొత్తగా పరిచయం అవుతున్నాయి. స్టైల్‌గా ఉండేవి. కానీ, పొట్ట మీద ఎంత పైకి లాగి కట్టుకున్నా, మరో ఆరంగుళాలు పాదాల క్రిందికి జారిపోతూ ఉండేవి. వాటిల్ని సైజ్ చేయించుకుని దాదాపు రెండు సంవత్సరాల పాటు మానేజి చేసాను.

ఆ పాంట్లేసుకుని నేను సైకిల్ తొక్కుతూ ఉంటే, చార్లీ చాప్లిన్ నడుస్తున్నట్టూ ఉండేది. రోజూ సైకిల్ తొక్కడం వల్ల ఫ్యాంట్లు సీటు దగ్గర చిరిగిపోయేవి. అతుకులు వేసేవాడ్ని. కానీ అవి కొట్టొచ్చినట్టు కనబడేవి.

వెనుక నుంచి కాలేజీ అమ్మాయిలు చూస్తారని బిడియంగా ఉండేది. అందుకని అందరి కన్నా ముందే క్లాసుకి వెళ్ళి సీట్లో కూర్చునేవాడ్ని. కాలేజీ అయిపోయాక, అందరూ వెళ్ళేవరకూ లేచేవాడ్ని కాదు. అందువల్ల ఇంటికి వెళ్ళేసరికి బాగా చీకటి పడేది.

పొద్దున్న నాలుగింటికి వెళ్ళటం, రాత్రి ఏడింటికి రావటం..! ఈ విధంగా చిరిగిన ఫ్యాంట్‌తో, హోటల్ వాడు పెట్టిన టిఫిన్లతో మొదటి సంవత్సరం పూర్తయింది.

---

నా కష్టాల్ని గ్లామరైజ్ చేసి, నేనిన్ని కష్టాలు అనుభవించానని నాటకీయంగా చెప్పటం నా ఉద్దేశ్యం కాదు. నాలో జరిగిన పరిణామక్రమాన్ని మీకు చెప్పాలనేదే నా తపన. ఇక్కడ చెపుతున్నవన్నీ వాస్తవాలు.

ఈ పుస్తకం ప్రారంభంలో నేనొక వాక్యం వ్రాశాను. ఒకటవ తరగతి నుండి మూడవ తరగతి వరకు నేను చాలా బ్రిలియంట్‌నని..! (మూడో తరగతిలో బ్రిలియంట్ ఏమిటా అని మీకు నవ్వు రావచ్చు. కానీ నేను నాలుగో తరగతి చదవకుండానే అయిదవ తరగతికి వెళ్ళాను). అటువంటిది, పదేళ్ళ వయసులో నాలుగు సంవత్సరాల పాటూ అయోమయ అజ్ఞానపు అంధకారంలో గడిపాను.

ఇంటర్మీడియెట్..! ఆ స్టేజిలో వర్తమానాన్ని ఎలా ప్రోసెస్ చేసుకుంటే భవిష్యత్తు అలా మారుతుంది..!!

అదొక రైల్వే జంక్షన్. రకరకాల రైళ్ళు అక్కడికి వస్తూ వుంటాయి.

ఒక రైలు కాశ్మీరుకి, మరొకటి జైసల్మీర్ ఎడారికీ తీసుకెళ్తుంది. పూలవనానికి వెళ్తావా, ఇసుక ఎడారికి వెళ్తావా అన్నది నీవే నిర్ణయించుకోవాలి. ఒకసారి రైలు ఎక్కిన తరువాత మారటం కష్టం. లక్షరూపాయల ఉద్యోగంతో ప్రారంభిస్తే కోటికి చేరుకోవటం సులభం. పదివేలతో మొదలు పెడితే లక్షకు చేరుకోవటం కష్టం. ఈ సందర్భంగా 'లోయ నుంచి శిఖరానికి' అన్న పుస్తకంలో కథ మీతో షేర్ చేసుకుంటాను.

ఒక తల్లి కొడుకుని ఒక స్వామి దగ్గరకు తీసుకువెళ్ళి, "స్వామీ! నా కొడుకు తెలివైన వాడే కానీ, మాట వినడు. చదువు తప్ప అన్ని విషయాల్లోనూ ఆసక్తి వున్నది. వాడికేదైనా చెప్పి మార్చండి" అన్నది. అతడు చదువుకున్నవాడు. జ్ఞాని.

“ఏం చెప్పను? దేని గురించి చెప్పను?" అని చిరునవ్వుతో అడిగాడు.

అక్కడ ఒక తారు రోడ్డు కొత్తగా వేస్తున్నారు. కొంటె కుర్రవాడు అటు చూపిస్తూ "దాని గురించి చెప్పండి" అన్నాడు. పక్కనే పడివున్న ఒక తారుముద్దని తీసుకు రమ్మని "ఈ తారు ఉండ ఖరీదు ఎంత వుంటుందో ఉజ్జాయింపుగా చెప్పగలవా?" అని అడిగాడు స్వామి.

"అయిదు నుంచి పది రూపాయలు".

"కానీ ఇందులోని పెట్రోలియంని సింథెటిక్ వైరుగా మారుస్తే, అది గుండె ఆపరేషన్‌లో పదివేలు ఖరీదు చేసే దారంగా పనిచేస్తుంది. ఈ ముద్దలోంచి వెయ్యి వైర్లు తయారు చేయవచ్చు. మరోలా చెప్పాలంటే ఈ పది రూపాయల తారుని మరొక రకంగా ప్రోసెస్ చేస్తే, దాని విలువ కోటి రూపాయలు అయివుండేది.”

వింటూన్న కుర్రవాడు నిశ్చేష్టుడయ్యాడు. అర్థమైనట్టుగా వినమ్రతతో నమస్కరించాడు.

మీకు కనపడిన ప్రతి విద్యార్థికీ పై కథ చెప్పండి. చివర్లో ఒక ప్రశ్న వేయండి. “భగవంతుడు ప్రత్యక్షమై, ‘...నీ మొదటి ఇరవై సంవత్సరాల జీవితం అద్భుతంగా ఉండి, తరువాత కఠినమైన సమస్యలతో నిండిపోతుంది. లేదా, మొదటి ఇరవై సంవత్సరాలూ సామాన్యంగా ఉండి, తరువాత అద్భుతంగా వుంటుంది. రెంటిలో నీకేది కావాలి?’ అని అడిగితే, ఏది కోరుకుంటావ"ని ప్రశ్నించండి.

“రెండోదే” అంటారు అందరూ.

“ఇరవై సంవత్సరాలంటే విద్యార్థి జీవితమే కదా” అనండి.

చాలు. అర్థమయ్యేవారికి అర్థమౌతుంది.

---

ఇనుముని కాల్చి ఒక రూపం తీసుకొస్తారు. బంగారాన్ని కాల్చి శుద్ధి చేస్తారు.

ఆ విధంగా బాల్యంలో కష్టాలే భవిష్యత్తులో మనిషిని గెలుపు వైపు నడిపిస్తాయని నా అభిప్రాయం.

"కేవలం డబ్బు లేకపోవటం వల్లే నేనిలా ఉండిపోయాను... అమ్మా నాన్నలు బీదవాళ్ళు అవటం వల్లే నేను చదవలేకపోయాను" అని ఏ విద్యార్థీ అనుకోనవసరం లేదు.

ఇప్పుడు నేను చూస్తున్న విద్యార్థులని గమనిస్తే సెల్‌ఫోన్లూ, స్మార్ట్‌ఫోన్లూ, ఛాటింగ్‌లూ, ఖరీదైన బట్టలూ... నాకేమీ ఈర్ష్య కలగట్లేదు కానీ, ఖర్చుకి ఇచ్చినంత విలువ చదువుకి ఇవ్వటంలేదేమో అన్న అభిప్రాయం కలుగుతోంది.

స్నానానికి వేణ్ణీళ్ళూ, తినటానికి రెండుపూటలా తిండి, మంచి వసతి, ఫ్యాను... ఇన్ని సుఖాలు ఇస్తున్న తల్లిదండ్రులకి న్యాయం చేయాలని, తమ భవిష్యత్తుని సరియైన క్రమంలో పెట్టుకోవాలని ఆలోచన చాలామంది విద్యార్థులకి ఉండటం లేదు.

'కాలేజీ చదువు' అంటే ఆడుతూ పాడుతూ తిరగటం అన్న అభిప్రాయం చాలమందికి ఉన్నది. అందులో తప్పేమీ లేదు కానీ, గ్రాడ్యుయేషన్ చేస్తున్న పిల్లలు ఇంటికొచ్చాక కనీసం అరగంట అయినా చదువుతారా అని నా అనుమానం.

మంచి మార్కులు రాక, ఆపై మంచి ఉద్యోగాలు దొరక్క డిప్రెషన్‌కి గురౌతున్న బీద, మధ్యతరగతి విద్యార్థులే ఈ ప్రశ్నకి సమాధానం చెప్పాలి.

ధనవంతుల సమస్యలు వేరే రకంగా ఉంటున్నాయి. అంతులేనంత సంపదలో పుట్టటాన్ని ఇంగ్లీషులో 'బార్న్ విత్ సిల్వర్ స్పూన్' అంటారు. సిల్వర్‌స్పూన్ తో పుట్టిన చాలామంది తమ జీవితాల్ని ఏ రకంగా నాశనం చేసుకున్నారో మనకు తెలుసు.

ఒక ఎమ్మెల్యే కొడుకు, ఒక ప్రసిద్ధ నటుడి కొడుకు, ఒక క్రికెటర్ కొడుకు, ఒక రాజకీయ నాయకుడి కొడుకు, సంపద వల్ల వచ్చిన కాంప్లెక్స్‌తో ఆక్సిడెంట్‌ల రూపాన దురదృష్టాన్ని ఏ విధంగా కొనితెచ్చుకున్నారో అందరికీ తెలిసిందే కదా.

మరో వైపు కొంత మంది పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తల, నటుల, రాజకీయ నాయకుల కొడుకులు జీవితంలో ఎంతో పైకి రావటం కూడా మనం చూశాం.

ఒక సినిమాలో ప్రకాష్‌రాజ్ కూతుర్ని ప్రేమించిన తరుణ్ "మీరు కోట్లు కోట్లు సంపాదించారు. మీ వారసులు కూడా ఆవిధంగా బీద స్థాయి నుంచి రావాలని కోరుకుంటున్నారా?" అని అడుగుతాడు.

దీనికి ప్రకాష్‌రాజ్ ఏమి సమాధానం చెప్పాడో నాకు తెలియదు కానీ నా ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రతీ కుర్రవాడూ రాటు దేలాలి. ఇక్కడ సమస్య డబ్బు కాదు. రాటు దేలాలి. అంతే. అదెలా?

ఉదాహరణకి అదే సినిమాలో ప్రకాష్‌రాజ్ తన కోట్లకోట్ల బిజినెస్ అల్లుడికి అప్పచెప్పాడనుకుందాం. దాన్ని అతను మేనేజ్ చేయాలి. అదేమీ పూలపాన్పు కాదు. నిజానికి మామూలు కష్టాల కన్నా, కోట్ల వ్యాపారాన్ని నిర్వహించే కష్టాలే ఎక్కువ. వేలమంది ఉద్యోగస్తులతో వ్యవహారం. దాన్ని సరిగ్గా నిర్వహించ లేకపోతే కేవలం మూడే మూడు సంవత్సరాల్లో మొత్తం సామ్రాజ్యం నాశనం అయిపోతుంది.

అలాంటి ట్రైనింగ్ కావాలంటే యువకులు తమ యవ్వనంలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కోవాలి.

**అబ్దుల్ కలాం ఎంతపైకి వచ్చాడో, ధీరూభాయి అంబాని కొడుకులు కూడా అంత పైకే వచ్చారు. ఇందిరా గాంధి మనవడు ఆమె అంత పేరు సంపాదించుకోలేక పోతున్నాడు.**

**పని చేస్తున్నంత కాలం ఒక ఏకాగ్రతతో, కమిట్‌మెంట్‌తో, బిలాంగింగ్‌నెస్‌తో చేయటం వల్లే (కష్టపడటం అనే పదాన్ని వాడటం నాకు ఇష్టం లేదు) పైకి వచ్చారు తప్ప, కేవలం తండ్రి గొప్పవాడు కాబట్టి రాలేదు.**

**కోటీశ్వరుడి కొడుకా, బిచ్చగాడి కొడుకా అన్నది సమస్య కాదు. చేస్తున్న పని పట్ల బిలాంగింగ్‌నెస్ ముఖ్యం.**

"నా తండ్రి మీద ఆధారపడటం కాదు. నేను స్వయంగా సంపాదించాలి" అన్న ఆలోచన ఉన్న యువకులందరూ ఎంతో అభివృద్ధి సాధించారు.

## 10

మా అమ్మ తెల్లవారుజామునే నాలుగు కిలోమీటర్లు నడిచి మధ్యాహ్నం వరకూ మోత్కు ఆకులు ఏరి తెచ్చేది. మధ్యాహ్నం సమయానికి కిలోమీటరు ఎదురెళ్ళి వాళ్ళందరికీ మంచి నీళ్ళు ఇచ్చేవాడిని. ఆ మూటలు ఎత్తుకుని ఇంటికి తీసుకొచ్చేవాడిని.

ఈ మోత్కు ఆకుల్ని ముందు తోరణాలుగా గుచ్చాలి. మూడురోజులపాటూ ఎండాక అవి ముడుచుకుపోకుండా అప్పుడప్పుడు నీళ్ళు జల్లుతూ బరువు పెట్టాలి. ఆపైన ముక్కిపోకుండా మళ్ళీ ఎండబెట్టాలి.

అప్పట్లో కంచాలు లేవు. మాది చాలా పెద్ద కుటుంబం అని ముందే చెప్పటం జరిగింది. ఆ మోత్కు ఆకుల్నే విస్తరాకులుగా కుట్టుకుని మేమందరం అందులోనే తినేవారం.

మిగిలిపోయిన ఆకులని వంద ఆకుల కట్టకి, రెండు రూపాయలు ఇచ్చేవారు. ఇది చాలా ఓపికతో చేయవలసిన పని.

కష్టపడటంలో ఉండే ఆనందం ఆవిధంగా అమ్మ నాకు నేర్పింది.

ఇంటర్మీడియట్‌కి వచ్చేసరికి ఆ విలువ నాకు కొద్ది కొద్దిగా అర్థమవసాగింది. నెమ్మది నెమ్మదిగా బాధ్యత తెలియటం ప్రారంభమయింది.

కాలేజీలో చేరాక చదువు మీద మళ్ళీ ఉత్సాహం పెరిగింది. బాగా చదివేవాడిని. అయితే నాతో వచ్చిన చిక్కేమిటంటే చిన్నతనం నుంచి పల్లెటూర్లో పెరగటం వల్ల ఇంగ్లీషంటే విపరీతమైన భయం ఉండేది. బహుశ గ్రామీణ విద్యార్థులందరికీ ఈ భయం అంతర్లీనంగా ఉంటుందనుకుంటాను.

ఎంత చదివినా ఇంగ్లీష్ దగ్గరకు వచ్చేసరికి ఆ భయం అలానే ఉండిపోయింది.

మా ఇంగ్లీష్ స్టాండర్డ్ ఎలా ఉండేదో ఒక ఉదాహరణ చెప్తాను.

మా ఊర్నుంచి సైకిల్ మీద కాలేజీకి వెళ్ళేటప్పుడు హనుమకొండ చౌరస్తాలో ఒక షాపు ముందు "బటర్ మిల్క్ – రూపాయిన్నర" అని వ్రాసి ఉండేది. అంత ఖరీదు పెట్టి అది తాగటానికి నా మనసొప్పేది కాదు.

కానీ చూసేకొద్దీ ఎప్పటికైనా ఎలాగైనా సరే అది తాగాలనే కోరిక రోజురోజుకీ పెరగసాగింది. కొంతకాలానికి ధైర్యం చేసి రూపాయిన్నర ఖర్చు పెట్టి తాగాను.

చాలా ఆశ్చర్యంగా అది "మజ్జిగ" అని తెలిసింది. బటర్ మిల్క్ అంటే బాదం మిల్క్‌లా ఏదో అపురూపమైన పానీయం అనుకున్నాను. మజ్జిగ అని తెలిసేసరికి నాకు సిగ్గేసింది.

మా ఇంట్లో ప్రతిరోజూ పొద్దున్న లేస్తే కుండలకొద్దీ పెరుగుండేది. దాంట్లో నీళ్ళు కలిపితే వచ్చే మజ్జిగని, ఇంగ్లీష్‌లో బటర్ మిల్క్ అంటారని ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వరకూ తెలీదు. అదీ నా ఇంగ్లీష్ స్టాండర్డ్..!

ఎంత ప్రయత్నించినా మొదటి సంవత్సరం ఇంగ్లీషు నేను మళ్ళీ తప్పాను. కానీ అదృష్టవశాత్తూ ఆరోజుల్లో ఒక సబ్జెక్ట్ తప్పినా సప్లిమెంటరీ రాసుకుంటూ రెండో సంవత్సరానికి వెళ్ళిపోవచ్చు.

రెండో సంవత్సరం మొదట్లో నాకు ఫస్ట్ ఇయర్ తాలూకు స్కాలర్‌షిప్ వచ్చింది. ప్రతిరోజూ అన్ని కిలోమీటర్లు ప్రయాణం చేయటం కష్టం కాబట్టి, పట్నంలోనే ఉండి చదువుకుంటే బాగుంటుందని మా అమ్మ సలహా ఇచ్చింది.

స్కాలర్‌షిప్ డబ్బులతో చిన్న గది తీసుకొని రెండో సంవత్సరం అంతా పట్నంలోనే ఉండిపోయాను.

అక్కడే నా జీవితం మారిపోయింది. ఒక వలయంలో చిక్కుకుపోయాను.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)